

## క్రేజీ ఛాన్స్ కొట్టేసిన ఐశ్వర్య లక్ష్మి

సౌత్ ఇండస్ట్రీలో అందం, అభినయంతో ఆకట్టుకున్న హీరోయిన్లలో ఐశ్వర్య లక్ష్మి ఒకరు. మెడిసిన్ పూర్తిచేసిన ఈ బ్యూటీ.. నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ ద్వారా సినిమా అవకాశాలు అందుకుంది. 2017లో మాయానది సినిమా ద్వారా మలయాళీ చిత్రపరిశ్రమలోకి రంగ ప్రవేశం చేసింది. మొదటి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత 2019లో యాక్షన్ మూవీతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత విష్ణు విశాల్‌తో చేసిన మట్టి కుస్తీ సినిమాతో పాపులర్ అయ్యింది. ఈ చిత్రాన్ని తెలుగులోనూ డబ్ చేశారు. అలాగే డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన పొన్నియన్ సెల్వన్ మూవీలో కీలకపాత్రలో కనిపించి మెప్పించింది. కేవలం గ్లామర్ రోల్స్ కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటుంది. అమ్ము సినిమాతో నటిగా ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న ఐశ్వర్య లక్ష్మి తాజాగా క్రేజీ ఛాన్స్ అందుకుంది. మెగా హీరో సాయి దుర్గా తేజ్ కెరీర్‌లో 18వ సినిమాగా రూపొందుతున్న ప్రాజెక్టులో ఐశ్వర్య నటించనుంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ మూవీ నుంచి ఇటీవలే ఐశ్వర్య ఫస్ట్ లుక్ రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే.



## ఊహకందని రేంజ్‌లో 'దేవర' ప్రీ సేల్స్

జూనియర్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషనల్‌లో వస్తున్న మూవి 'దేవర'. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీ అనేక సంచలనాలను క్రియేట్ చేస్తోంది. అభిమానులు సహా అందరూ ఎంతో ఆతృతగా ఈ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ మధ్య విడుదలైన ఫియర్ సాంగ్, చుట్టమల్లే.., దావుడి సాంగ్స్‌కు, టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్‌తో సినిమాపై ఉన్న అంచనాలు పీక్స్‌కు వెళ్లాయి. అయితే ఈ చిత్రాన్ని ప్రత్యాంగిర సినిమాస్ అమెరికాలోనే ఎప్పుడు ఎవరూ చేయనంత గొప్పగా రిలీజ్ చేయటానికి సన్నాహాలు చేస్తోంది. రీసెంట్‌గానే ప్రీ బుకింగ్స్‌ను యూఎస్‌లో ఓపెన్ చేయగా అక్కడ సెన్సేషన్ క్రియేట్ అవుతుంది. ఇప్పటికే ప్రీ సేల్స్ ఊహించని విధంగా ఐదు లక్షల డాలర్స్‌ను దాటేయడం విశేషం. సినిమాపై ఉన్న బజ్, ఊపు చూస్తుంటే ఇంకా ఈ లెక్క రోజు రోజుకీ పెరుగుతోందే కానీ తగ్గటం లేదు. అయితే తొందరలోనే ట్రైలర్‌ను కూడా మేకర్స్ విడుదల చేయబోతున్నట్లు తెలుస్తోంది. కాగా, మొదటి భాగం 'దేవర పార్ట్ 1'ను తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ నెల 27న విడుదల చేస్తున్నారు.




## స్టైలిష్ అవతార్‌లో రామ్ చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'.. ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోంది. 2024 క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే 'గేమ్ చేంజర్' నుంచి తమన్ సంగీత సారథ్యంలో వచ్చిన 'జరగండి జరగండి..' పాట ఎంత సెన్సేషన్ అయ్యిందో అందరికీ తెలిసిందే. తాజాగా వినాయక చవితికి ఇచ్చిన అప్‌డేట్ పోస్టర్, అందులోని న్యూస్ అభిమానులు సహా అందరిలోనూ మరింత ఉత్సాహాన్ని నింపేలా ఉంది. పోస్టర్‌ను గమనిస్తే.. రామ్ చరణ్ తలకు ఎర్రటి టవల్ చుట్టుకుని స్టైలిష్ అవతార్‌లో కనిపిస్తున్నారు. డైరెక్టర్ శంకర్ పవర్‌ఫుల్ రోల్‌లో చరణ్‌ను ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.

## ఓటీటీలో రచ్చ చేస్తోన్న వరుణ్‌సందేశ్ 'నింద'

హీరో వరుణ్ సందేశ్ తాజాగా నటించిన చిత్రం 'నింద'. ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ జగన్నాధం డెరెక్ట్ చేసి, నిర్మించారు. ఈ సినిమాలో వరుణ్ యాక్టింగ్ హైలైట్‌గా నిలిచింది. థియేటర్‌లో విడుదలై బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్నే సాధించింది. ఈ మూవీ వినాయక చవితి సందర్భంగా ఈ నెల 6 నుంచి ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఓటీటీలో కూడా ఈ చిత్రానికి మంచి అనూహ్య స్పందన వస్తోంది. కేవలం ఒక్క రోజులోనే 1.4 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌తో నింద చిత్రం టాక్ ఆఫ్ ద ఓటీటీగా మారిందని మేకర్స్ వెల్లడించారు. ఇక, ఈ ట్రెండ్ చూస్తుంటే నింద ఓటీటీలో మరింత వేగంగా దూసుకెళ్లే అవకాశం వుందని కూడా అంటున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో వచ్చిన నింద చిత్రం వరుణ్ సందేశ్ నటనలోని కొత్తకోణాన్ని ఆవిష్కరించిందని చెబుతున్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వుండే ఈ చిత్రం ఓటీటీలో మరింత మంది ప్రశంసలు అందుకుంటుందనే నమ్మకం ఉందని నిర్మాత తెలిపారు. ఈ మూవీలో యానీ, శ్రేయ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్య కుమార్, చత్రపతి శేఖర్, మైమ్ మధు, సిద్ధార్థ్ గొల్లపూడి, అరుణ్ దలై ముఖ్య పాత్రాలు పోషించారు.






## నిర్మాతగా మారిన హనీరోజ్..

హీరోయిన్ హనీరోజ్.. నందమూరి నటసింహం వీరసింహారెడ్డి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ మూవీలో బాలయ్య భార్యగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో తెలుగులో మరిన్ని ఆఫర్స్ వస్తాయనుకున్నారు. కానీ, ఈ మూవీ తర్వాత హనీ ఎక్కువగా షాపింగ్ మాల్స్ ఓపెనింగ్ వేడుకల్లోనే కనిపించింది. అయితే ఇప్పుడు హనీరోజ్ కొత్త బిజినెస్ రంగంలోకి అడుగుపెట్టింది. ఇప్పటివరకు సినిమాల్లో కథానాయికగా అలరించిన హనీరోజ్.. ఇప్పుడు నిర్మాణ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. త్వరలోనే నిర్మాతగా పలు చిత్రాలను నిర్మించనుంది. హనీ రోజ్ వర్గీస్ ప్రొడక్షన్స్ పేరుతో నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ద్వారా తెలియజేసింది. 'సినిమా అనేది చాలామందికి ఒక కల. ఒక విజన్.. ఒక వెంచర్. అదొక ఫాంటసీ. జీవిత కోరిక. దాదాపు 20 ఏళ్లుగా సినిమాల్లో భాగమయ్యాను. ఇప్పుడు దీనిని ఓ వరంలా భావిస్తున్నాను. నా జీవితంలో సినిమా చాలా పెద్ద పాత్ర పోషించింది. కాబట్టి ఇదే పరిశ్రమలో పెద్ద పాత్ర పోషించడం ఇప్పుడు నా కర్తవ్యంగా భావిస్తున్నాను. నా పుట్టినరోజు సందర్భంగా కొత్త వెంచర్ లోగోను లాంచ్ చేస్తున్నాను. అభిమానుల నుంచి నాకు లభించిన ప్రేమే నేను సినిమాల్లో గొప్ప పాత్రలు పోషించేలా చేసింది. మీరు నాపై చూపించిన ప్రేమ ఎప్పటికీ కొనసాగుతుందని ఆశిస్తున్నాను. నా ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. హెచ్ఆర్‌వీ ప్రొడక్షన్స్ ద్వారా నా కోరిక నెరవేరుతుందని భావిస్తున్నాను. టాలెంట్ ఉండి ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నవారికి ఇది వారధిలా నిలబడుతుంది. అద్భుతమైన కథలను సినీ ప్రియులకు చెప్పాలనుకుంటున్నాము' అంటూ రాసుకొచ్చింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999